andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.2 ; కనిష్ఠం 25.3


ఉపాధి హామీలో.. వసూళ్ల పర్వం



- జిల్లాలో ఉపాధి హామీ సిబ్బంది చేతివాటం
- కూలీల నుంచి ప్రతీవారం డబ్బుల వసూలు
- కింది స్థాయి సిబ్బంది చేత ఒత్తిళ్లు
- సూత్రధారులుగా సంబంధిత అధికారులు
- డబ్బులు వసూళ్లతో క్షేత్రస్థాయిలో నెరవేరని లక్ష్యం
- కరువైన పర్యవేక్షణ

నిర్మల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఉపాధి హామీలో కూలీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వ్యవహారం దుమారం రేపుతోంది. కొంతమంది కిందిస్థాయి సిబ్బంది తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ ఈ వసూళ్లకు తెగబడుతున్నారంటున్నారు. ముఖ్యంగా కూలీల నుంచి హస్తా వసూల్ మాదిరిగా ప్రతీవారం రూ.200లను అ కారణంగా ముక్కు పిండి వసూలు చేస్తున్నారంటున్నారు. డబ్బులు చెల్లించని కూలీల హాజరుతో పాటు వారికి వేధింపులు కూడా తప్పడం లేదంటున్నారు. ఉపాధి హామీ కూలీల నుంచి డబ్బుల వసూలు చేసేందుకు ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లకు సంబంధిత శాఖ అధికారులనే అప్పజెపుతున్నారంటున్నారు. అధికారుల ఆదేశాలతో మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు గత్యంతరం లేక ఈ వసూళ్లు చేయాల్సి వస్తోందని అంటున్నారు. కూలీల నుంచి వసూలు చేసిన చేయకపోయిన తమకు మాత్రం వారం వారం చెల్లింపులు జరపాల్సి ఉంటుందనిపై అధికారులు వీరికి హెచ్చరికలు జారీ చేస్తుండడంతో ఈ వసూళ్ల పర్వం అడ్డూఅదుపు లేకుండా పోతోందని చెబుతున్నారు. గ్రామాల వారీగా వసూలు చేసిన డబ్బులను మండలాల వారీగా జమ చేసి జిల్లాస్థాయిలో పంపకాల పర్వాన్ని సాగిస్తున్నారన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గత కొంతకాలం నుంచి ఇలా కూలీల ద్వారా డబ్బులు వసూలు చేస్తున్న కారణంగా క్షేత్రస్థాయిలో పనులు సక్రమంగా జరగకపోవడం అలాగే సరియైన పర్యవేక్షణ, తనిఖీలు లేని కారణంగా ఆశించిన లక్ష్యం నీరుగారుతోందని చెబుతున్నారు. ఇప్పటికే ఈ వసూళ్లపర్వంపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు కొంతమంది ఫిర్యాదులు చేశారంటున్నారు. వారం పది రోజుల్లో ఈ వసూళ్ల పర్వంపై గ్రామీణ అభివృద్ధి శాఖకు సంబంధించిన సీనియర్ అధికారులు విచారణ జరిపే అవకాశాలున్నాయని అంటు న్నారు. ఇప్పటికే వారంతా ఈ ఆరోపణలపై నివేదికలు రూపొందించి దానికి అనుగుణంగా విచారించబోతున్నట్లు చెబుతున్నారు. అయితే ప్రస్తుతం ఈ వ్యవహారం ఇక్కడి ఐకేపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారుతోందని అంటున్నారు.

సోషల్ ఆడిట్‌లతో వసూళ్ల వెల్లడి

ఇదిలా ఉండగా ఉపాధి హామీ పనులపై నిర్వహిస్తున్న సోషల్ ఆడిట్ తనిఖీల్లో ఈ వసూళ్ల వ్యవహారం బయట పడుతోందని అంటున్నారు. ఈ సామాజిక తనిఖీలను థర్డ్‌పార్టీ అధికారులు నిర్వహిస్తున్నందున వారు క్షేత్రస్థాయి సిబ్బంది ప్రమేయం లేకుండానే వసూళ్లపై కూలీలను కూపీ లాగుతున్నట్లు సమాచారం. అయితే కూలీలు తాము ప్రతీవారం రూ.200 వరకు క్షేత్రస్థాయి సిబ్బందికి చెల్లిస్తున్నామని, ఇదీ అధికారిక కటింగ్ అని తమకు చెబుతుండడంతోనే డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని అంటున్నారు. సామాజిక తనిఖీల నివేదికలను థర్డ్‌పార్టీ ఏజెన్సీల సిబ్బంది సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు ఇప్పటికే ఫిర్యాదులు చేశారంటున్నారు. థర్డ్‌పార్టీ ఏజెన్సీ ఫిర్యాదులపై రాష్ట్రస్థాయి అధికారులు స్పందించి ఆకస్మిక తనిఖీలకు, బహిరంగ విచారణకు రంగం సిద్ధం చేస్తున్నారని అంటున్నారు.

రూ.43లక్షలకు పైగా అవకతవకలు

సోషల్ ఆడిట్ ద్వారా అక్రమాలు పెద్ద ఎత్తున వెలుగు చూస్తున్నాయని అంటున్నారు. జిల్లాలో మొత్తం రూ.43,09,578 అక్రమాలు జరగగా ఇందులో నుంచి 31,83,912లక్షలను రికవరీ చేశారు. అయితే మరో 11,25,766 లక్షలను సిబ్బంది నుంచి రికవరీ చేయాల్సి ఉందని అంటున్నారు. ముఖ్యంగా వేసవిలో పని చేసే ఉపాధి హామీ కూలీలకు కల్పించే సౌకర్యాల వ్యవహారంలో పెద్దమొత్తంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలున్నాయి. పనులు తక్కువగా చేసి ఎక్కువ బిల్లులు లేపడం, సౌకర్యాలు కల్పించకున్నప్పటికి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చూపి తప్పుడు బిల్లులతో ఈ స్వాహా పర్వానికి పాల్పడుతున్నారని అంటున్నారు. అయితే ఈ సోషల్ అడిట్‌ను సైతం తూతూ మంత్రంగానే సాగుతున్నాయని అక్రమాలు వెలుగు చూసినప్పటికి ఉన్నతాధికారులు మాత్రం సీరియస్‌గా చర్యలు తీసుకోకుండా షోకాజ్ నోటీసులతో చేతులు దులుపుకుంటున్నారంటున్నారు.

తనిఖీలు, పర్యవేక్షణలు కరువు

కాగా జిల్లా ఉపాధి హామీ పథకం అమలులో తనిఖీలు నామమాత్రంగా మారాయని, పర్యవేక్షణ లోపం అడుగడుగునా కనిపిస్తోందని అంటున్నారు. ఒకవేళ తనిఖీలు జరిపిన ఈ సమాచారాన్ని ముందస్తుగానే క్షేత్రస్థాయి సిబ్బందికి అందించి అందరిని అప్రమత్తం చేస్తున్నారని అంటున్నారు. అధికారులు తనిఖీలకు వచ్చే సమయంలో అంతా సవ్యంగా ఉన్నట్లే చూపుతున్నారని పేర్కొంటున్నారు. తిలా పాపం తలా పిడికెడు అన్న చందంగా ఈ వ్యవహారంలో కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు అవకతవకలు జరుగుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడం అక్రమార్కులకు వరంగా మారుతోందని చెబుతున్నారు. ఇకనైనా జిల్లాలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి సరియైన పర్యవేక్షణ, తనిఖీలు చేపట్టాలని, కూలీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వ్యవహారాన్ని నిలువరించి పారదర్శకత పాటించాలని అంటున్నారు.

కన్న కొడుకే కాలయముడయ్యాడు

- కొడవలితో కన్న తల్లిని పొడిచి చంపిన తనయుడు


ఇందిరాబాయి మృతదేహం

లోకేశ్వరం, జూలై 8 : కన్న కొడుకు చేతితోనే తల్లి దారుణహత్యకు గురైన సంఘటన లోకేశ్వరం మండలంలో సోమవారం జరిగింది. లోకేశ్వరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లక్ష్మీనగర్ తండాలో తల్లి ఎల్. ఇందిరాబాయి(60)ను ఆమె కన్నకొడుకు రాయబాబు కొడవలితో పొడిచి హత్య చేశాడు. గత కొద్దిరోజులుగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని సోమవారం ఉదయం కూడా తల్లి కొడుకులు ఇద్దరు గొడవ పడగా వెంటనే కొడవలితో తల్లిని కడుపులో పొడవగా సంఘటన స్థలంలోనే ఇందిరాబాయి మృతి చెందిందని తెలిపారు. సంఘటన స్థలాన్ని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్, ముథోల్ సీఐ మల్లేష్, ఏఎస్సై దిగంబర్‌లు సందర్శించి వివరాలు సేకరించారు.

ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న

పండ్ల దుకాణాల తొలగింపు : ఈశ్వర్


పండ్ల దుకాణాలను తొలగించాలని చెబుతున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ కల్చరల్, జూలై 8 : రోడ్డుపై ప్రజలకు, వాహనదారులకు ఆటంకంగా ఉన్న పండ్ల బండ్లు, దుకాణాలను, ప్రచారబోర్డులను తొలగించినట్లు చైర్మన్ ఈశ్వర్ తెలిపారు. సోమవారం వివేకానంద చౌక్, మయూరి హోటల్, కిసాన్ షాపింగ్‌మాల్ తదితర ప్రాంతాల్లోని వాటిని ఆయన దగ్గరుండి జేసీబీ సహాయంతో తొలగింపజేశారు. ప్రధానకూడళ్లలో ఇబ్బందులు తొలగించేందుకు రెండో దశలో తొలగిస్తామని ఈశ్వర్ చెప్పారు. పట్టణ సీఐ, టీపీవో సుమలత, నవీన్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

పిచ్చికుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు


పిచ్చి కుక్కల దాడిలో గాయాలపాలైన బాధితులు



భైంసా రూరల్, జూలై 8 : మండలంలోని సుంక్లి గ్రామంలో సోమవారం పిచ్చికుక్కల దాడిలో ముగ్గురు స్థానికులు గాయాలపాలయ్యారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం రాత్రి ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో గ్రామానికి చెందిన నర్సయ్య, ముత్తవ్వ, సాగర ముగ్గురిని కుక్కలు తీవ్రంగా గాయపరిచాయి. కుటుంబీకులు వెంటనే భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పిచ్చి కుక్కలను అదుపు చేయాలని స్థానికులు అధికారులను కోరారు.

బాసర ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్ ప్రారంభం


ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

బాసర, జూలై, 8: బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు సోమవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. మొత్తం 1500ల మంది విద్యార్థులకు 500 ల చొప్పున మూడు రోజుల పాటు ఈ కౌన్సిలింగ్ జరగనుంది. మొదటి రోజు 458 మంది విద్యార్థులు ప్రవేశం పొందగా 42 మంది గైర్హాజరైనట్లు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. ప్రవేశం పొందిన విద్యార్థులకు ఆగస్టు మొదటి వారంలో తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ప్రమాదం జరిగితే బాధ్యత మీదే..

- కఠిన చర్యలుంటాయి
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి
- బాసర పుణ్యక్షేత్రంలో నాటు పడవల నిర్వాహకులకు పోలీసులు, దేవస్థాన అధికారుల హెచ్చరిక


సమావేశంలో మాట్లాడుతున్న ఈవో విజయరామారావు , బాసర ఎస్ఐ గణేష్

బాసర, జూలై, 8 : ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే దానికి నాటు పడవలు నడిపేవారే బాధ్యులవుతారని బాసర పుణ్యక్షేత్రంలో గోదావరినదిలో నాటు పడవలు, దోనెలు నడిపేవారిని స్థానిక పోలీసులు, దేవస్థాన అధికారులు హెచ్చరించారు. సోమవారం పడవలు నడిపే వారితో దేవస్థాన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆలయ ఈవో విజయరామారావు, స్థానిక ఎస్ఐ గణేష్ వారికి పలు సూచనలు, ముందస్తు జాగ్రత్తలు ఇస్తూనే హెచ్చరికలు జారీ చేశారు. లైఫ్‌జాకెట్ లేకుండా పడవలో యాత్రికులను ఎక్కించుకోరాదని ఆదేశించారు. అవసరమైన ట్యూబ్‌లు , పడవల్లో, దోనెల్లో ఉంచుకోవాలని పరిమితికి మించి మనుషులను పడవలో తిప్పరాదని హెచ్చరించారు. వర్షాకాలం సమయం కావున నది ఉధృతంగా ప్రవహించే అవకాశం ఉందని, ఇలాంటి సమయాల్లో పడవలు నడపడకపోవడమే మంచిదని ఆదేశించారు. దురదృష్టవశాత్తు ఏదైనా జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయని దాన్ని దృష్టిలో ఉంచుకొని పడవలు నడిపించుకోవాలని హెచ్చరించారు. పడవలతో నదీ స్నానాలు ఆచరించే భక్తులు అసౌకర్యం కలించరాదని ఆలయ ఈవో సూచించారు. నదీ స్నానాలు ఆచరించే ఘాట్‌ల వద్ద పడవలను దోనెలను నిలపకూడదన్నారు. భక్తుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా కఠినచర్యలు తీసుకుంటామన్నారు.


హాజరైన నాటు పడవల నిర్వాహకులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్


ప్రజావాణికి హాజరైన అధికారులు

నిర్మల్ కల్చరల్, జూలై 8 : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠినచర్యలుంటాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి, సీఎం ప్రజావాణి దరఖాస్తులు పరిశీలించి వేగవంతంగా పరిష్కారం చేయాలన్నారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయ, కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్, భూ సమస్యలపై అధికంగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. శాఖల వారీగా పరిశీలించి అధికారులు పరిష్కరించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. వర్షం నిలువ ఉండే ప్రాంతాల్లో డ్రైనేజీలలో యాంటీలార్వా వృద్ధి చెందకుండా నిరంతర పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ వసతిగృహాల్లో ఫీవర్ సర్వే నిర్వహించి రిపోర్టులు అందజేయాలన్నారు. అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, డీఆర్‌వో భుజంగరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సర్వేయర్ అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఖానాపూర్ మండల రెవెన్యూశాఖలో పనిచేస్తున్న మండల సర్వేయర్ అక్రమాలకు పాల్పడుతున్నారని అతనిపై చర్య తీసుకోవాలని పాత ఎల్లాపూర్ గ్రామ రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఈ మేరకు గ్రామ రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాత ఎల్లాపూర్ శివారులో కే. లక్ష్మీ భవాని భూమి సర్వేనెంబర్లు 344, 345 అమ్మడం, కొనడం జరిగిందని తెలిపారు. భూములను చట్టానికి వ్యతిరుకంగా ఆయన ఇష్టారాజ్యంగా కొలతలు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారుల అండ చూసుకొని అడిగిన వారిని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. గతంలో నిర్మల్‌లో డి-1 పట్టాలు, షేత్వారీల కుంభకోణాలపై కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్నందున చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అల్లెపు పీటర్, రైతు సంఘం జిల్లా నాయకుడు భూక్యా సురేందర్, పి. స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు

- తల్లిదండ్రులను బాధ్యులుగా చేసి వాహనం సీజ్ చేస్తాం : జిల్లా ఎస్పీ జానకీషర్మిల

నిర్మల్ కల్చరల్, జూలై 8 : జిల్లాలో మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలుంటాయని ఎస్పీ జానకీషర్మిల తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ... మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టిపెట్టి తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మైనర్లు వాహనాలు నడిపిస్తే వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని తల్లిదండ్రులను వారితో పాటు కోర్టులో హాజరుపరిచి జరిమానా, శిక్ష విధిస్తారని తెలిపారు. ఒకరకంగా ప్రమాదాలకు తల్లిదండ్రులు కారణమవుతున్నారన్నారు. తమ పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహిస్తే జీవితాలు ఇబ్బందికరంగా మారుతాయన్నారు. మైనర్ డ్రైవింగ్‌పై, రోడ్డు ప్రమాదాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నిర్మల్ పట్టణ పర్యటనలో నలుగురు మైనర్లు ఓ వాహనంపై వెళ్లడం గమనించిన ఎస్పీ వాహనాన్ని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేయించారు.

ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ

జిల్లా ఎస్పీ జానకిషర్మిల సోమవారం ప్రజావాణిలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వారి సమస్యలు విని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు నిర్భయంగా నేరుగా పోలీసుస్టేషన్‌కు వచ్చి తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చునని సూచించారు. మూడో వ్యక్తి ప్రమేయం అవసరం లేదన్నారు.


ఎస్పీకి సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని తెలిపారు. సమాజంలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను పోలీసులకు తెలియజేయాలని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గంజాయి విక్రయాలు జరిగిన, రవాణా చేస్తున్న వెంటనే తమకు సమాచారం అందించాలని 8712659599 నెంబర్ అందుబాటులో ఉంటుందని వివరించారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టిన ఆర్ అండ్ బీ అధికారులు



సారంగాపూర్, జూలై 8 : మండలంలోని కౌట్ల(బి) గ్రామ సమీపంలో కురిసిన వర్షాలకు రోడ్డు గుంతలు గుంతలుగా మారడంతో బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లడంతో వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్‌లో మాట్లాడడంతో అధికారులు స్పందించి గుంతలు గుంతలుగా మారిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టినట్లు గ్రామస్థులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సస్పెన్షన్ వేటు

నిర్మల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాములను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ టెండర్ల వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు రాములుపై పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అర్హతలు లేని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలను సైతం టెండర్ ప్రక్రియలో పాల్గొనేందుకు అవకాశం కల్పించడమే కాకుండా ఆ ఏజెన్సీకి అనుకూలంగా ఓ డాక్యుమెంట్‌ను సైతం టెండర్ ప్రక్రియలో దాఖలు చేశారన్న ఆరోపణతో పాటు మరికొన్ని ఆరోపణలపై జిల్లా కలెక్టర్ సీరియస్‌గా స్పందించారు. ఈ వ్యవహారంపై అక్కడికక్కడే విచారణ జరిపిన కలెక్టర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అభిలాష అభినవ్ కొద్దిరోజుల్లోనే ఫిర్యాదులపై స్పందించి ఓ జిల్లా స్థాయి అధికారిని సస్పెండ్ చేయడంతో ఇక్కడి కలెక్టరేట్‌లో కలకలం మొదలైంది.

గ్రామస్థులను భయభ్రాంతులకు గురి చేసిన వ్యక్తికి 14 రోజుల జైలు

సారంగాపూర్, జూలై 8 : మండలంలోని స్వర్ణ గ్రామానికి చెందిన డోలు నవీన్ అనే వ్యక్తి గత నెల రోజుల క్రితం గ్రామస్థులను భయభ్రాంతులకు గురి చేయడంతో లస్మవ్వ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి సోమవారం అడిషనల్ కోర్టు మేజిస్ట్రేట్ ముందు నవీన్‌ను హాజరుపరచడంతో అడిషనల్ కోర్టు జడ్జి 14 రోజులపాటు జైలుశిక్ష విధించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

ఒకరి అదృశ్యం

సారంగాపూర్, జూలై 8 : మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన టీకారం వంశీధర్(35) అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. టీకారం వంశీధర్ సోమవారం ఉదయం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

27వ వార్డులో సౌకర్యాలు కల్పించాలి

నిర్మల్ కల్చరల్, జూలై 8 : నిర్మల్ పట్టణం 27వ వార్డులో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ సోమవారం ఆ వార్డు ప్రజలు కలెక్టర్‌కు ప్రజావాణిలో వినతిపత్రాన్ని అందజేశారు. సీసీ రోడ్డు నిర్మాణాన్ని మున్సిపల్ పాలకవర్గం పట్టించుకోవడం లేదని తెలిపారు. రోడ్డుపై నీరు నిల్వ ఉంటుందని, ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు సక్రమంగా లేకపోవడంతో ప్రజారవాణాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని విన్నవించారు. రఫీక్‌అహ్మద్, సాహెబ్‌ఖాన్, ఫయాజ్ అహ్మద్, ఖయ్యుం, తదితర మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడికి సన్మానం

నిర్మల్ కల్చరల్, జూలై 8 : బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన ఆనంద్ గౌడ్‌ను సోమవారం గౌడ జన పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర నాయకులు సన్మానించారు. అమరవేణి నర్సాగౌడ్, సిద్ధిరాములుగౌడ్, అంజనేయులుగౌడ్, కిరణ్ కుమార్‌గౌడ్, బాలేశంగౌడ్ పాల్గొన్నారు.

'ముథోల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ నగేష్

భైంసా, జూలై 8: ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ముథోల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే పవార్ రాంరావ్‌పాటిల్‌తో కలిసి బాధ్యతాయుతంగా పాటుపడుతానని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడెం నగేష్ వెల్లడించారు. సోమవారం భైంసాలో ముథోల్ నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో నియోజకవర్గ ప్రగతికి బాటలు వేస్తానని పేర్కొన్నారు. ప్రాధాన్యతననుసారం సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి చిత్తశుద్ధితో చర్యలు చేపడుతానని స్పష్టం చేశారు. పార్లమెంట్ పరిధిలోని రైల్వే స్టేషన్ల అధునీకరణకు, జాతీయ రహదారుల నిర్మాణానికి ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. కేంద్ర నిధులతో పాటు రాష్ట్ర ప్రభుత్వనిధులు మంజూరి, కేటాయింపుల కోసం ఆయా నియోజకవర్గ శాసనసభ సభ్యులతో సమన్వయం చేసుకొని ముందుకు సాగుతానని వివరించారు. పార్లమెంట్ ఎన్నికలను స్ఫూర్తిగా స్థానిక సంస్థల ఎన్నికల కోసం పార్టీ శ్రేణులు సన్నద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ మొదలుకొని మండల పరిషత్, జిల్లా పరిషత్‌లో కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ నేతృత్వంలో ఎంపీ గొడం నగేష్‌కు ఘనంగా సన్మానించి జ్ఞాపికలు బహుకరించారు. ఇందులో పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జీ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నగర్ నారాయణరెడ్డి, రవి పాండే, ప్రతినిధులు బాజీరావ్, సోలంకే భీమ్‌రావ్ పాటిల్, సాంవ్లీ రమేష్, రావుల పోశెట్టి, బాలాజీ సూత్రావే , మున్సిపల్ మాజీ చైర్మెన్ బి. గంగాధర్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబులతో పాటు పలువురు పాల్గొన్నారు.

● రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

చికిత్సల కోసం ఆసుపత్రి వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన రీతిలో వైద్య సేవలు అందించాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గెడం నగేష్ భైంసా ఏరియా ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. సోమవారం ఆసుపత్రిలో పునర్ నిర్మాణం చేపట్టిన అవుట్ పెషెంట్ బ్లాక్, స్త్రీ వైద్య సేవల విభాగాలను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ గెడం నగేష్ మాట్లాడారు. ఆసుపత్రిలో వసతుల కల్పన, సౌకర్యాల మెరుగుదలకు అవసరమైన తోడ్పాటునిస్తానని తెలిపారు. అధునిక పరికరాలను సమకూర్చేందుకు సహకరిస్తానన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలు అందించాలని అకాంక్షించారు. ఇందులో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కాశీనాథ్‌తో పాటు వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

లఖంపూర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి

నేరడిగొండ, జూలై8: మండలంలోని లఖంపూర్ గ్రామసమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం రాత్రి నిర్మల్ వైపునకు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం గుర్తుతెలియని వ్యక్తిపై నుంచి వెళ్లడంతో మృతి చెంది ఉండవచ్చన్నారు. పెట్రోలింగ్‌లో భాగంగా సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకోగా పూర్తిగా గుర్తుపట్టలేనంతగా మృతుడి ముఖభాగం నుజ్జునుజ్జు అయ్యిందన్నారు. పంచనామా అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని బోథ్ మార్చురికి తరలించమన్నారు.

కేస్లాగూడ(జి), లింగూడలో వైద్య శిబిరం

ఇంద్రవెల్లి, జూలై 8: మండలంలోని కేస్లాగూడ (జి), లింగూడ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ పూజిత ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజిత మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వాటి వల్ల వెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఇందులో హెల్త్ సూపర్ వైజర్ శ్రీనివాస్, వైద్య ఆరోగ్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఆదిలాబాద్ రూరల్, జూలై8: ఆదిలాబాద్ పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ వ్యక్తి మిస్సింగ్ కేసు నవెదు చేసినట్లు ఎస్సై నజీబ్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త కుమ్మరివాడ కాలనీకి చెందిన పోతుగంటి చిన్న ధర్మన్న అనే వ్యక్తి రెండు రోజులుగా కనబడడం లేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన సదరు వ్యక్తి ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు కంగారు పడ్డారు. ఇరుగుపొరుగు వారిని అడిగినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పేర్కొన్నారు.

● ఆదిలాబాద్‌లో మహిళ అదృశ్యం..

ఆదిలాబాద్ పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కిష్టయ్య తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన కుమ్మరి లక్ష్మి సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని కుటుంబీకులు పేర్కొన్నారు. దీంతో ఇరుగు పొరుగు వారిని అడిగినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిస్తే సమాచారం అందించాలని పేర్కొన్నారు.

భూముల పట్టాల కోసం కార్యాలయంలో జన సందోహం

బోథ్, జూలై 8: సోమవారం బోథ్ తహసీల్దార్ కార్యాలయం జన సందోహంతో నిండిపోయింది. వివిధ పనులపై తహసీల్దార్ కార్యాలయానికి భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. అయితే ఇటీవల ప్రభుత్వం ఐదు ఎకరాల లోపు ఉన్న వారికి రైతు బంధు వస్తుందని అంతకంటే ఎక్కువగా ఉంటే రైతుబంధు ఇవ్వాలని ప్రచారం జరగడంతో భారీ సంఖ్యలో రైతులు తమ భూములను కుటుంబీకులను రిజిస్ట్రేషన్ పట్టా చేసి ఇచ్చేందుకు తీసుకువచ్చారు. రైతులు ముందు చూపుగా తమ తమ కుటుంబాల వారికి పట్టా చేయించారు.

'కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు చేయాలి'

ఉట్నూర్, జూలై8: ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన గిరిజనేతర వ్యక్తి భూ వివాదంలో ఉట్నూర్‌కు చెందిన దుర్వా మహేశ్‌ను కులంపేరుతో దూషించినందున ఆయనపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీఎస్‌పీసీహెచ్ నాగేందర్‌కు తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ సంఘాలజేఏసీ నాయకులు ఫిర్యాదు చేశారు. సోమవారం డీఎస్పీ నాగేందర్‌ను రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కనకయాదవరావు, ఆడ హనుమంతరావులు కలిసి డీఎస్పీకి ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. అదే విధంగా దుర్వమహేశ్ భూ విషయంలో గొడవకు పాల్పడి, కులంపేరుతో దూషించి పంపుతానని బెదిరించిన గిరిజనేతరుడు అయిన రాజేశ్వర్ పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ విషయమై భూ పట్టాదారు రాజేశ్వర్‌ను వివరణ కోరగా తాను ఎవరిని కులంపేరుతో తిట్టలేదని, తన భూమిని అక్రమించడానికి ఏర్పాటు చేసిన కంచెను తొలగించాలని తెలిపారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

తలమడుగు, జూలై 8: మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన మెస్త్రి కృష్ణ (18) తల్లిదండ్రులు తనకు సెల్‌ఫోన్ కొని ఇవ్వలేదని ఆత్మహత్య చేసుకున్నట్లు తలమడుగు ఎస్సై సురేందర్ తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని ఉమ్రి గ్రామానికి చెందిన నాగరావు కుమారుడు తనకు తల్లిదండ్రులు నెలరోజుల నుంచి సెల్‌ఫోన్ కొనివ్వాలని అడుగగా.. ఆర్థిక పరిస్థితి బాగాలేదని తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశంలో జూలై 3న మధ్యాహ్నం 12 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం 8గంటల ప్రాంతంలో ఉమ్రి గ్రామస్థులు కాలకృత్యం గురించి గుట్టపైకి వెళ్లగా అక్కడ ఉరివేసుకుని కన్పించాడని తెలిపారు. మృతుడి అన్న మెస్రం చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు ఇవ్వగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

ముక్రా(కె)లో ఆరోగ్య వైద్య శిబిరం

ఇచ్చోడ, జూలై8: మండలంలోని ముక్రా(కె) గ్రామంలో మంగళవారం ఇచ్చోడ పీహెచ్‌సీ వైద్యుడు సాగర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలకు, విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమున్న వారిని గుర్తించి మందులను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతలో భాగంగా భోజనానికి ముందు చేతులు కడగడం, బయటినుంచి ఇంటికి రాగానే శుభ్రంగా కాళ్లు చేతులు కడుక్కోవాలని, మనచుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

లక్ష్యంతో చదివి ఉన్నతులుగా ఎదగాలి

బోథ్, జూలై8: విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నతులుగా ఎదగాలని మాజీ మండల అధ్యక్షులు తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం సోనాల గ్రామంలో నిర్వహించిన అభినందన సభలో పాల్గొని ప్రసంగించారు. పాఠశాలలో చదివే విద్యార్థులు చెడు అలవాట్లకు వెళ్లకుండా తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చే విధంగా చదవాలన్నారు. సోనాల గ్రామంలో ఎంతోమంది ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉన్నతులుగా ఎదిగారని వారిని ఆదర్శంగా తీసుకుని చదవాలన్నారు. కాగా పాఠశాలకు వచ్చిన 15 మంది ఉపాధ్యాయులను ఎంపీపీ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీని సన్మానించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

బోథ్, జూలై 8: ఆదిలాబాద్ జిల్లా ఎంపీగా గెలుపొందిన జి.నగేష్ సోమవారం బోథ్ మండల ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదిలాబాద్‌లోని ఆయన స్వగృహంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీకి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నపాగ అశోక్, కారం రవి, పాలెపు గోపి, ప్రసాద్, మాజీ జిల్లా అధ్యక్షులు గజ్జల శంకర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా వైఎస్ఆర్ జయంతి వేడుకలు

మావల, జూలై8: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదిలాబాద్ పట్టణంలోని కేఆర్కే కాలనీలో గల వృద్ధాశ్రమంలో వృద్ధుల నడుమ కేక్‌ను కట్ చేసి వైఎస్ఆర్‌కు ఘన నివాళులర్పించారు. అనంతరం పండ్లను పంపిణీ చేసి సేవా భావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో మావల



వృద్ధులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు దామోదర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, రంజిత్‌రెడ్డి, కుర్ర నరేష్, అదిత్య పాల్గొన్నారు.

● రైతులకు రుణమాఫీ, తక్కువ ధరకు బీటీ విత్తనాలు అందజేసిన ఘనత వైఎస్ఆర్‌దే..

జైనథ్, జూలై8: ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో రైతులందరికి రుణమాఫీతో పాటు మోఎన్‌సాంటో కంపనీతో మాట్లాడి రైతులకు రూ.750కే తక్కువ ధరకే రైతులకు బీటీ విత్తనాలను అందించిన ఘతన దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి ఆర్.దీపక్‌రావు అన్నారు. సోమవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను పురస్కరించుకొని జైనథ్ మండలంలోని గిమ్మా,జైనథ్, ఆనంద్‌పూర్, ఆదిలాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో వైఎస్ ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో నాయకులు తదితరులున్నారు.

● వైఎస్ గొప్ప నాయకుడు

బోథ్ : వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, ఆయన హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలు ఎన్నటికీ మరువలేరని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ తదితర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఎంపీటీసీ కురుమే మహేందర్, నాయకులు రాజురెడ్డి, భోజన్న, అబూద్, మహమూద్, వంశీరెడ్డి, అబ్రార్, శేఖర్, గంగారాం, రహీ ముద్దీన్, షాకీర్, తదితరులు పాల్గొన్నారు.



గడ్డి మందు స్ప్రే చేయిస్తున్న దృశ్యం

పిచ్చిమొక్కల తొలగింపు

బోథ్, జూలై 8: మండలంలోని కౌటా(బి) గ్రామంలోని రైతువేదిక చుట్టూ మొలిచిన పిచ్చి మొక్కలను గ్రామ అధికారులు తొలగించారు. 'పిచ్చిమొక్కలు తొలగించరూ!' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి గ్రామ అధికారులు స్పందించారు. సోమ వారం పిచ్చిమొక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. పిచ్చిమొక్కలు తొలగించడంతో పాటు గడ్డి మందును కొట్టించారు.

ఎడతెరపి లేకుండా వర్షాలు

● ఆదిలాబాద్ జిల్లాలో జోరుగా కురుస్తున్న వర్షాలు ● బేల మండలంలో 106.3 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదు
● పరవళ్లు తొక్కుతున్న పొచ్చెర, కుంటల, గాయత్రి జలపాతాలు ● మొదలైన పర్యాటకుల తాకిడి

ఆదిలాబాద్, జూలై 8(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. సోమవారం జిల్లా సాధారణ వర్షపాతం 10.7 మి.మీ.లు కాగా.. అధికంగా 24.8 మి.మీ.ల వర్షపాతం కురిసింది. అత్యధికంగా బేల మండలంలో 106.3 మి.మీ.లు, జైనథ్‌లో 73.8, ఇంద్రవెల్లిలో 56.5, భీంపూర్‌లో 49.5, తాంసిలో 40.3మి.మీ.ల వర్షపాతం కురిసింది. అదేవిధంగా అత్యల్పంగా ఉట్నూర్‌లో 1.5మి.మీ.ల వర్షపాతం నమోదైంది. గత రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో చెరువులు, కుంటలు ప్రాజెక్టుల్లోకి స్వల్పంగా వరదనీరు వచ్చి చేరుతోంది. కుంటాల, పొచ్చెర జలపాతాలు వరద నీటితో పరవళ్లు పెడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా వర్షాలు కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కొత్త వర్షపునీటితో కుంటాల జలపాతం హొయలు



పరవళ్లు తొక్కుతున్న పొచ్చెర జలపాతం

● అటవీ లోయలో అందమైన జలపాతం

ఇచ్చోడ: అడవుల జిల్లా.. ప్రకృతి సహజ వనరుల ఖిల్లా.. సహజసిద్ధ అడవుల్లో అందాల జలపాతం భూతల స్వర్గాన్ని తలపిస్తూ పర్యాటకులను కనువిందు చేస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ మండలం గుండివాగు గ్రామంలోని గాయత్రి జలపాతం. అంతేకాకుండా ఇటీవల ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షంతో గాయత్రి జలపాతం ధారల ప్రవాహం ఉధృతి మరింత పెరిగింది. దీంతో గాయత్రి జలపాతానికి జలకళ సంతరిం చుకుంది. సోమవారం గాయత్రి జలపాతంలో ఎగిసిపడుతున్న నీటి ప్రవాహాన్ని చూసేందుకు పర్యాటకులు ఉత్సాహం చూపారు.



ఆదిలాబాద్ జిల్లాలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షం



ఎగిసి పడుతున్న గాయత్రి జలపాతం



కూలి డబ్బులు త్వరగా అందించాలని ఏపీవోకు విన్నవిస్తున్న కూలీలు

మూడు నెలలైనా.. అందని కూలి

● ఉపాధి హామీ డబ్బుల కోసం కూలీల ఆందోళన

తలమడుగు, జూలై 8: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసిన కూలీలకు మూడు నెలలైనా ఇంకా కూలి డబ్బులు అందడం లేదని సోమవారం ఉపాధి హామీ కూలీలు అధికారులకు విన్నవించి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ వేసవి కాలంలో ఉపాధిహామీ పనులకు వెళ్లిన ఇప్పటి వరకు అధికారులు కూలి డబ్బులు అందించడం లేదన్నారు. సంబంధిత శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు గ్రామంలో రెండు వందల వంది కూలీలకు ఐదు వారాల డబ్బులు రావాల్సి ఉన్నప్పటికీ.. ఇంత వరకు రావడం లేదన్నారు. చేతిలో డబ్బులు లేక పూట గడవడం లేదన్నారు. కిరాణా షాపుల్లో వారికి ఎవరూ కూడా ఉద్దెర నిత్యవసర సామగ్రి ఇవ్వడం లేదన్నారు. అధికారులు స్పందించి త్వరగా ఉపాధి కూలి డబ్బులు అందేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో కూలీలు అంతా కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్తామని వారు తెలిపారు. వెంటనే స్పందించిన ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో మేఘమాల, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా డబ్బులు అదేవిధంగా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

'ఉన్నత చదువులతోనే సత్ఫలితాలు'

ఉట్నూర్, జూలై 8: విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, ఉన్నత చదువులతోనే సత్ఫలితాలు వస్తాయని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న కొమురంభీం స్టడీ సర్కిల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు కష్టపడి ఉన్నత చదువులు చదువుకొని అన్నిరంగల్లో రాణించాలన్నారు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చిన వాటిని ఎదుర్కొంటూ లక్ష్య సాధన దిశగా పయనించాలని పేర్కొన్నారు. స్టడీ సర్కిల్ అభివృద్ధికి తనవంతుగా సహాయం అందిస్తానని తెలిపారు. కంప్యూటర్, బుక్స్ సరైన వసతులు కల్పించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇందులో నాగోరావు, జంగు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాలి'

ఆదిలాబాద్ రూరల్, జూలై 8: ఆదిలాబాద్ పట్టణ శివారులోని నిషాన్ ఘాట్ ఏరియాలో నివాసం ఉంటున్న పేదలకు పట్టాలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఏళ్లుగా నివాసం ఉంటున్న అధికారులు, ప్రజాప్రనిధులు పట్టించుకోవడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ రాజార్షిషాకి వినతిపత్రం అందజేశారు. నాయకులు నళిని, రమేష్, రాములు, తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఘనంగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి

● ఆదిలాబాద్ జిల్లాలో నివాళులర్పించిన నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, జూలై 8: ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలను ప్రజలు ఎన్నటికీ మరువలేరని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. సోమవారం వైఎస్ 75వ జయంతిని పురస్కరంచుకుని కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఘన నివాళులర్పించారు. పార్టీ శ్రేణులు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకుంటు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు జిల్లాను అనేక రంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. జిల్లా కేంద్రంలో పేదల కోసం రిమ్స్ ఆసుపత్రి, రైతుల కోసం మత్తడివాగు ప్రాజెక్టు ఆయన హయాంలో వచ్చాయని తెలిపారు. 104, 108తో పాటు ఆరోగ్యశ్రీ, రైతు రుణ మాఫీ ప్రాజెక్టులను నిర్మించారని గుర్తు చేశారు. అన్నివర్గాలకు సమన్యాయం చేసేలా పథకాలను అమలు చేశారన్నారు. ఆయన చేసిన సేవలను ప్రజలు ఎన్నటికీ మరవలేరన్నారు. పార్టీ శ్రేణులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బాలూరిగోవర్ధన్‌రెడ్డి, నాయకులు దిగంబర్ రావుపాటిల్, నగేష్, గిమ్మా సంతోష్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, బండారి సతీష్, ఆవుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి సందర్భంగా నేరడిగొండలోని పార్టీ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా ఆ మహానాయకుడు అమలు చేసిన సంక్షేమ పథకాలు ఆయనను పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిపిందని స్మరించుకున్నారు. ఆయన వెంట బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంతరావు, బ్లాక్ అధ్యక్షులు అల్లూరి ప్రఫుల్‌చందర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ అబ్రార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, పాల శంకర్, రహీముద్దిన్, మౌలాన, లక్ష్మణ్, కుంట శంకర్ ఉన్నారు.



వైఎస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఉట్నూర్: ఉమ్మడి రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఉట్నూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుమ్, సింగిల్ విండో చైర్మన్ ఎస్సీరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దూట రాజేశ్వర్, మైనార్టీ మండల అధ్యక్షులు ఎస్కే సలీం, తదితరులున్నారు.

ఇంద్రవెల్లి: మాజీ సీఎం వైఎస్ఆర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిరుపేదలకు, కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు చిరస్మరనీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం కొనియాడారు. సోమవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ మండల నాయకులతో కలిసి వైఎస్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమోరే నాగోరావు, మిర్జా యాకూబ్ బేగ్, మెస్రం నాగ్‌నాథ్, సావంత్ లహందాస్, గైయక్‌వాడ్ దిలిప్ తదితరులు పాల్గొన్నారు.

గుడిహత్నూర్: మండలకేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాల్యాల కరుణాకర్ ఆధ్వర్యంలో స్వర్గీయ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ ఎంతో మంది పేద ప్రజలకు ఉచితంగా ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్య సేవలు అందించారని, అలాగే ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకం ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత చదువు అందించారని గుర్తు చేశారు. ఇందులో మండల ఉపాధ్యక్షుడు ఆరీఫ్‌ఖాన్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఆడే సునీల్, నాయకులు నరేష్, రామారావు, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'నాన్ టీచింగ్ సిబ్బందికి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి'




ధర్నా చేస్తున్న కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది

నిర్మల్ కల్చరల్, జూలై 8 : కేజీబీవీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి కనీస వేతనాలు రూ.26 వేల చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 470 పాఠశాలల్లో ఐదు వేల మంది నాన్ టీచింగ్ సిబ్బంది పని చేస్తున్నారన్నారు. వారి శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు రెగ్యులర్ చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదని విమర్శించారు. బేసిక్ పే నిర్ణయించి వేతనాలు చెల్లించాలని, పదవి విరమణ తరువాత 10 లక్షల రూపాయల పారితోషికం తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. కేజీబీవీ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి కే. కవిత, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూమ్‌లు వెంటనే లబ్ధిదారులకు స్వాధీనం చేయాలి

● భైంసా పట్టణం డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల సంఘం



కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న దృశ్యం

నిర్మల్ టౌన్, జూలై 8 : భైంసా పట్టణంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వెంటనే లక్కీ డ్రా లబ్ధిదారులకు ఇవ్వాలని న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జే. రాజు డిమాండ్ చేశారు. భైంసా పట్టణం డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి, కలెక్టర్‌కి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... డబుల్ బెడ్ రూమ్‌లు నిర్మాణం చేసి, గత సంవత్సరం లక్కీ డ్రా ద్వారా లబ్ధిదానులను ఎంపిక చేశారు. కానీ ఇప్పటికీ లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న కానీ లబ్ధిదారులకు స్వాధీనం చేయలేదు. డబుల్ బెడ్ రూమ్ ఎన్నికల హామీగానే మిగిలిపోయింది. అవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయని, ఇప్పటికీ కనీస సౌకర్యాలైన మంచినీరు, విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు లేవు. ఇప్పటికైనా వాటిని ఇవ్వాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సత్యనారాయణ, అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గిరిధర్ జంగ్మే, సతీష్, వకీల్, ఎండీ అఫాన్, షైక్ మౌలా, బి. భాస్కర్, లక్ష్మణ్ పటేల్, కేశవ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పంటల సాగు వివరాల నమోదు

దిలావర్‌పూర్, జూలై 8 : పంటల సాగు వివరాల నమోదుకు వ్యవసాయ శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. మండలంలోని మూడు క్లస్టర్ల పరిధిలోని పంట భూములను ఆయా క్లస్టర్ల ఏఈవోలు స్వయంగా పంట భూములకు వెళ్లి సాగుచేస్తున్న పంట వివరాలు నమోదు చేసుకుంటున్నారు. రైతులు ఏ పంట, ఎన్ని ఎన్నికల్లో సాగు చేస్తున్నారన్న విషయాన్ని పంటను ప్రత్యక్షంగా పరిశీలించాకే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఏఈవో తప్పనిసరిగా వ్యవసాయ క్షేత్రాలకు వచ్చి సాగు చేస్తున్న పంటను పరిశీలించాకే నమోదు చేస్తారని, రైతులు సహకరించాలని ఎంఏవో స్రవంతి కోరారు.

మధ్యాహ్న భోజనం వికటించి

10 మంది విద్యార్థులకు అస్వస్థత

● నిర్మల్ జిల్లాలో ఘటన ● ఆలస్యంగా వెలుగులోకి..





భైంసా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

భైంసా రూరల్, జూలై 8 : మధ్యాహ్న భోజనం వికటించి 10మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన నిర్మల్ జిల్లాలో సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని భైంసా మండలం దేగాం గ్రామంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత శనివారం విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేశారు. తిన్న తర్వాత విద్యార్థులు ఒక్కొక్కరుగా వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. సాయంత్రం వేళ ఇంటికెళ్లాక తీవ్ర కడుపునొప్పితో బాధపడ్డారు. దీంతో కుటుంబీకులు గ్రామంలోని ఆర్ఎంపీ వద్ద బాధిత విద్యార్థులకు చికిత్స చేయించారు. అయితే ఆదివారం విద్యార్థులకు మరోసారి వాంతులు, విరేచనాలు కావడంతో.. మొత్తం 10మందిని చికిత్స నిమిత్తం వెంటనే భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆస్పత్రికి వరుస పెట్టి మరీ విద్యార్థులు వస్తుండడంతో.. అసలు ఏం జరిగిందనే విషయమై తల్లిదండ్రులు ఆరా తీశారు. విద్యార్థుల అస్వస్థతకు కలుషిత ఆహారమే కారణమని తెలుసుకున్న తల్లిదండ్రులు సోమవారం ఉపాధ్యాయుల తీరుపై మండిపడ్డారు. విద్యార్థులను పరామర్శించేందుకు వచ్చిన పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు రాగా.. వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే.. తమకు ఎందుకు చెప్పలేదని ప్రశ్నించారు. ఇందుకు కారణమైన భోజన ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా.. అస్వస్థతకు గురైన విద్యార్థులు ప్రస్తుతం కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు.





శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీకి యత్నం

● పూజారి అప్రమత్తతతో పట్టుబడిన దొంగ

భైంసా, జూలై 8 : పట్టణంలోని పద్మావతీ కాలనీ పరిధిలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి దొంగ ఒకడు చోరీకి యత్నించి పట్టుబడ్డాడు. ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపిన కథనం ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం రాత్రి 10.30 ప్రాంతంలో దొంగ ఒకడు ఆలయం వెనుక వైపు ప్రహరి నుంచి లోపలికి దూకి చోరీకి యత్నించాడు. ఆలయ ప్రాంగణంలోని హుండీని పగులకొట్టి అందులోని నగదును తస్కరించేందుకు విఫలయత్నం చేశాడు. ఆలయంలోని వంటశాల ముందరి బాగంలోనున్న అన్నం కలిప గరిటేను తీసుకొని హుండీని స్థలం నుంచి పక్కకు నెట్టాడు. అనంతరం హుండీని తలకిందులుగా చేసి గరిటే ద్వారా హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును తీసుకునేందుకు విఫలయత్నం చెసాడు, సంబంధిత సమయంలో చప్పుడు రావడంతో ఆలయ పూజారి కిటికీ తీసి చూడగా హుండీ పగుల కొడుతున్న విషయాన్ని గుర్తించాడు. వెంటనే అప్రమత్తమై సంబంధిత సమాచారాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులకు సెల్‌ఫోన్ ద్వారా అందించాడు. ఇందుకు స్పందించిన ఆలయ కమిటీ ప్రతినిధులు పోలీసులకు చోరి జరుగుతున్న విషయాన్ని చేరవేసారు. దీంతో పోలీసులు హుటాహుటిన ఆలయం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ గుమిగూడిన ఆలయ కమిటీ ప్రతినిధులు , కాలనీవాసులు , పోలీసులు ఒక్కో వైపు నుంచి చుట్టుముట్టి దొంగ బయటకు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. వీరందరూ వచ్చిన సమాచారం తెలుసుకున్న ఆలయ పూజారి తన గది నుంచి ఒక్కసారిగా బయటకు వచ్చి దొంగను కదలకుండా గట్టిగా పట్టుకున్నాడు, అప్పటికే లోపలికి దూసుకవచ్చిన పోలీసులు దొంగను బంధించి తమ ఆదుపులోకి తీసుకొని పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సంబంధిత చోరి ఘటనపై ఆలయ కమిటీ ప్రతినిధులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ధ్వంసమైన హుండీ



హుండీ పగులకొట్టేందుకు వినియోగించిన అన్నం కలిపే గరిటె

'బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు నిరంతర పోరాటం'

ఖానాపూర్, జూలై 8 : బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో నిరంతర పోరాటాన్ని కొనసాగిస్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సునారికారి రాజేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. రాజీనామా చేసిన కార్మికులందరికీ కేంద్ర ప్రభుత్వం 10,000ల రూపాయల పెన్షన్‌ను అందజేయాలని కోరారు. బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో ఈ నెల 10వ తేదీన నిర్మల్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం లింగన్న, డివిజన్ నాయకులు మాలావత్ జెవింద్, మద్దినేని చిన్న రాజన్న, ముంజం దేవేందర్ తదితరులున్నారు.

'శ్రమించే నాయకులకు కాంగ్రెస్ పార్టీలో ఖచ్చితంగా గుర్తింపు లభిస్తుంది'

ఖానాపూర్, జూలై 8 : పార్టీ కోసం శ్రమించే నాయకులకు కాంగ్రెస్ పార్టీలో తప్పక గుర్తింపు లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద్‌నాయక్ అన్నారు. సోమవారం ఖానాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీ కోసం శ్రమించిన వారికి న్యాయం జరుగుతుందనేందుకు నిదర్శనమే నేడు గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా బెల్లయ్య నాయక్ తేజావత్ నియామకమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా తేజావత్ బెల్లయ్య నాయక్‌ను నియమించడం పట్ల ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేస్తోందన్నారు. గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా తేజావత్ బెల్లయ్య నాయక్‌ను నియమించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా పలువురు ప్రభుత్వ పెద్దలకు లంబాడా హక్కుల పోరాట సమితి తరఫున ధన్యవాదాలు చెబుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.


ఎప్పటికీ ప్రజాసేవలో ముందుంటా

● వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ కొంద్ర రేఖారమేష్

నర్సాపూర్(జి), జూలై 8 : నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో సోమవారం ఎంపీపీ కొంద్ర రేఖారమేష్, వైస్ ఎంపీపీ మ్యాదరి లక్ష్మీసుధాకర్‌కి, యంపీటీసీలకు అధికారులు, నాయకులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వనజ మాట్లాడుతూ ఈ ఐదు సంవత్సరాల కాలంలో ప్రజా సమస్యల కోసం పాటు పడిన వ్యక్తి ఎంపీపీ కొంద్ర రేఖారమేష్ అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కొంద్ర రేఖా రమేష్, వైస్ ఎంపీపీ మ్యాదరి లక్ష్మీసుధాకర్‌న యంపీటీలకు అధికారులు, నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. వీడ్కోలు సమావేశంలో ఎంపీపీ కొంద్ర రేఖారమేష్ మాట్లాడుతూ ఎంపీపీగా వీడ్కోలు పొందిన ఎల్లప్పుడూ ప్రజా సేవలో ముందు ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు యంపీడీవో పుష్పలత, యంపీవో శ్రీనివాస్‌గౌడ్, జడ్పీటీసీ అర్గుమీది రామయ్య, తహసీల్దార్ సోమ శ్రీనివాస్, యంపీటీసీలు మంగ్లారపు మల్లేష్, కోఆప్షన్ సభ్యుడు ఫసీఉద్దీన్ నాయకులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

ముథోల్, జూలై 8 : కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన హామీలన్నీ వెంటనే అమలు పరచాలని సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ విఠల్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులపై నిర్లక్ష్యం వహిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల రుణమాఫీ డిసెంబరు 9న చేస్తానని మాట ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికీ రెండు లక్షల రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. అలాగే రైతు బంధు సంవత్సరానికి రూ. 15 వేలు ఇస్తానని ఇవ్వడం లేదని, అలాగే పంట నష్టపరిహారం అందజేయాలని పేర్కొన్నారు. అలాగే రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12,000లు ఇస్తానని చెప్పి ఇవ్వడం లేదని, కౌలు రైతులకు కూడా రైతు బీమా ఇస్తానని అమలు పరచడం లేదన్నారు. వెంటనే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు ముత్యం రెడ్డి, ముథోల్ మండల అధ్యక్షులు కోరి పోతన్న, మాజీ ఉప సర్పంచ్ మోహన్, ధర్మపురి శ్రీనివాస్, సాయి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



'ఏజెన్సీ ప్రాంతంలో ఫీజుల దోపిడీని అరికట్టాలి'

ఇచ్చోడ, జూలై 8: ఏజెన్సీ ప్రాంతంలో ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలని టీజీవీపీ ఉమ్మడి ఆదిలాబాద్ అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతున్నాయని, అనుమతులు లేకుండా పాఠశాలలు నడుస్తున్నా.. జిల్లా, మండల విద్యా శాఖ అపట్టించుకోవడం లేదని వారు మండిపడ్డారు. ఇందులో బోథ్ నియోజకవర్గ కన్వీనర్ గోర్ల నరేందర్, సతీష్, సాయిగణేష్, సురేష్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లాకేంద్రంలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు




ఏడాదైనా.. ఎదురుచూపులే!

- జిల్లాలో 2023 ఏప్రిల్‌లో లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక
- అదృష్టం కలిసి వచ్చినా.. ఇప్పటికీ అందని డబుల్ బెడ్‌రూం ఇల్లు
- ఒకవైపు లబ్ధిదారుల జాబితా సిద్ధమైనా.. మరోవైపు ఖరారు కాని ముహూర్తం
- మరమ్మతుల పేరిట కాలయాపన చేస్తున్న సంబంధిత శాఖల అధికారులు
- మొత్తం 3,860 ఇళ్లను మంజూరు చేసిన గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- కొత్త ప్రభుత్వంపై గంపెడు ఆశలు పెట్టుకుంటున్న నిరుపేదలు
- జిల్లావ్యాప్తంగా 982 ఇళ్లను కేటాయించేందుకు నిర్ణయించగా.. లక్కీడ్రా ద్వారా 618 మంది ఎంపిక

ఆదిలాబాద్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించేందుకు 2023 ఏప్రిల్‌లో లబ్ధిదారుల ఎంపికకు అధికారులు ఎంతో హడావుడిగా లక్కీ డ్రా నిర్వహించారు. కానీ ఇప్పటి వరకు ఎంపికైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూంను అందించక పోవడం తో ఎదురుచూపులు తప్పడం లేదు. ముందు నుంచి జిల్లాలో డబుల్ బెడ్‌రూం పథకంపై నిండు నిర్లక్ష్యమే కనిపిస్తోంది. దీంతో నిరుపేదల డబుల్ బెడ్‌రూం కల నెరవేరడమే లేదు. జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు పూర్తై ఐదేళ్లు గడిచిపోయినా.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల ముచ్చట తీరడం లేదు. జిల్లాకు గత ప్రభుత్వం 3,860 ఇళ్లను మంజూరు చేసింది. ఇందులో 2,291 ఇళ్ల నిర్మాణాలకు టెండర్లను పూర్తి చేశారు. కానీ 1200 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో కనిపిస్తున్నాయి. 500 ఇళ్ల నిర్మాణాలను మాత్రమే పూర్తి చేశారు. అయితే ఎన్నో ఆందోళనలు, వినతుల అనంతరం డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు ప్రక్రియను మొదలు పెట్టిన అధికారులు హడావుడిగా ఆగమేఘాల మీద లక్కీ డ్రా నిర్వహించి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేశారు. కానీ అది మూనాళ్ల ముచ్చటగానే మారింది. అయితే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు ఉంటుందని అందరూ బావించారు. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో డబుల్ బెడ్‌రూం కల నెరవేరకుండానే పోయింది. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు మాసాలు గడుస్తున్నా.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపుపై అసలు ఊసెత్తకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

లక్కీడ్రాలో 618 మంది ఎంపిక

గత యేడాది క్రితం జిల్లాలో 982 ఇళ్లను కేటాయించేందుకు అధికారులు నిర్ణయించారు. ఇందులో మున్సిపల్ పరిధిలో లక్కీ డ్రా ద్వారా 32 వార్డుల్లో 618 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అప్పట్లోనే లబ్ధిదారుల ఎంపిక జాబితా పై పలు ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. అధికార పార్టీకి చెందిన నేతలకు సంబంధించిన వారికే డబుల్ బెడ్‌రూం ఇళ్లు దక్కాయన్న విమర్శలు కూడా వచ్చాయి. జిల్లా కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రా నిర్వహించగా.. అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులు ఉన్నాయి. మున్సిపల్ పరిధిలో 618 లబ్ధిదారుల ఎంపిక పూర్తి కావడంతో ఇళ్ల కేటాయింపును చేసేందుకు అధికారులు కసరత్తు చేసినా.. ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో డబుల్ బెడ్‌రూం కేటాయింపు ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. ఆ తర్వాత లోక్ సభ ఎన్నికలు రావడంతో మరింత ఆలస్యమైంది. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే ఇళ్ల కేటాయింపు ఉంటుందని అందరూ భావించినా.. ఇంకా జాప్యం జరుగుతూనే ఉంది. మొదటి విడతకే మోక్షం లేకపోవడంతో రెండవ విడతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేవుడు కరుణించినా.. పూజారి వరమియ్య లేదన్నట్లుగా డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల పరిస్థితి మారిందంటున్నారు. అయితే వేలల్లో దరఖాస్తులు రావడంతో వందల సంఖ్యలో ఇళ్ల కేటాయింపులు చేపడితే వ్యతిరేకత తప్పదన్న ఉద్దేశంతోనే బీఆర్‌ఎస్ పార్టీ నేతలు డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపును నిలిపివేశారన్న ఆరోపణలు ఉన్నాయి.



బీటలు వారుతున్న నిర్మాణాలు

గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్వహణను గాలికి వదిలేయడంతో నిర్మాణాలు బీటలు వారి కనిపిస్తున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో ఇళ్లలోకి వర్షపు నీరు చేరి అధ్వానంగా మారుతున్నాయి. క్షేత్ర స్థాయిలో అధికారుల పర్యవేక్షణ కరువవడంతో ఇళ్ల నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే పలు చోట్ల తలుపులు, కిటికీలు, దర్వాజాలు విరిగిపోవడం, చెదలు పట్టి ధ్వంసం కావడం, కిటికీ అద్దాలు మరుగుదొడ్ల పైపులు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. దీంతో సంబంధిత అధికారులు మరమ్మతుల పేరిట తీవ్ర కాలయాపన చేస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ఎక్కడా మరమ్మతులు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ఇప్పటికే లబ్ధిదారులకు కేటాయించి ఉంటే.. వారే సొంతంగా మరమ్మతులు చేసుకునే అవకాశం ఉండేది. ఐదేళ్లు గడుస్తున్నా.. అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లు అటువైపు కన్నెత్తయినా చూడడం లేదు. ఇంకా పూర్తిస్థాయిలో బిల్లులు చేతికి రాకపోవడంతో మెంటనెన్స్ చేయలేమంటూ కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. మరమ్మతు పనులను చేపట్టి రంగులు వేయాలంటే అదనంగా లక్షల రూపాయల నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం నిర్మాణ గోడలే తప్ప.. విద్యుత్ వైర్లు, మంచినీటి ట్యాంకులు, మరుగుదొడ్ల పైపులు, తలుపులు, కిటికీలు ఎక్కడా కనిపించడం లేదు. కొన్ని చోట్ల నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తుంది. అంతేకాకుండా పనులు పూర్తయిన వెంటనే లబ్ధిదారులకు కేటాయించి ఉంటే ఇలాంటి పరిస్థితి వచ్చి ఉండేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్లపై దృష్టి సారించాలని నిరుపేద లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు రాగానే.. లబ్ధిదారులకు కేటాయిస్తాం

: శ్రీనివాస్, అర్బన్ తహసీల్దార్, ఆదిలాబాద్

ఇప్పటికే లక్కీ డ్రా నిర్వహించి మొదటి దశ లబ్ధిదారుల ఎంపికను పూర్తి చేయడం జరిగింది. ప్రభుత్వ ఆదేశాలు రాగానే ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లను కేటాయిస్తాం. ఇప్పటికే మున్సిపల్ పరిధిలో 618 మంది లబ్ధిదారుల జాబితాను విడుదల చేశాం. మరో 364 లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను రెండవ దశలో పూర్తి చేయాల్సి ఉంది. చిన్నపాటి మరమ్మతులు చేపట్టి ఇళ్ల కేటాయింపును చేపడతాం. ఎంపిక చేసిన లబ్ధిదారులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు.

సంక్షిప్త సమాచారం

నేడు రోజువారీ సంత వేలం

ఇచ్చోడ, జూన్, 8: ఇచ్చోడ మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన రోజువారి సంతలకు సంబంధించి మంగళవారం గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి లక్ష్మణ్ అధ్యక్షతన వేలంపాట నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ ఈవో సూర్యప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ తెగల కులాలకు సంబంధించిన ఇచ్చోడ స్థానికులకు మాత్రమే ఈ వేలంపాటలో అర్హులని ఆయన పేర్కొన్నారు.

.. ఈత ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ రూరల్, జూలై 8: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడాప్రాంగణంలో గల స్విమ్మింగ్‌పూల్‌లో ఈనెల 9న మంగళవారం ఉదయం 10 గంటలకు జిల్లాస్థాయి ఈత ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంఘం కార్యదర్శి మహేందర్ జిత్, స్విమ్మింగ్ కోచ్ కొమ్ము కృష్ణ తెలిపారు. గ్రూప్-1 విభాగంలో 15, 16, 17, గ్రూప్-2 విభాగంలో 12, 13, 14, గ్రూప్-3 విభాగంలో 10, 11 ఏళ్ల బాల బాలికలకు ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్‌ఫ్లై, ఇండివిజువల్ మెడ్లే క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తామని వివరించారు. ఎంపికైన బాల, బాలికలు ఈనెల 13, 14 తేదీల్లో సికింద్రాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ ఇండోర్ స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ స్విమ్మింగ్ ఛాపింయన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు.

కేజీబీవీ పాఠశాల ఆకస్మిక తనిఖీ

బజార్‌హత్నూర్, జూలై 8: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల వసతి గృహంలోని గదిలో గల నిల్వ పదార్థాలను ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి శ్యాంసుందర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా వంట గది నిర్వహణ, ఆహార పదార్థాలు, కూరగాయలు, రేషన్ సరుకులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహార పదార్థాల వంట విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి అధికారి సూచించారు. పాఠశాలలో పరిశుభ్రతను పాటించాలన్నారు.

'ఫసల్ బీమా అమలు చేయాలి'

బోథ్, జూలై 8: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఫసల్ బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగిషు బొర్రన్న ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం ఫసల్ బీమాను అమలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం రైతుల వాటాగా రూ. 1500 కోట్లు ఫసల్ బీమా యోజన కింద ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లిస్తామని పేర్కొనడం జరిగిందన్నారు. అయితే ఖరీఫ్ పంటలు వేసి 20 రోజులు కావస్తోందని, అయినా ప్రభుత్వం ఫసల్ బీమాకు 17లోగా చెల్లిం చాల్సి ఉన్నా.. ఇంతవరకు చెల్లించలేదన్నారు.

'రాథోడ్ మృతి తీరని లోటు'

ఇంద్రవెల్లి, జూలై 8: మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ మృతి బీజేపీ పార్టీకి తీరని లోటని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మృతి పట్ల శ్రద్ధాంజలి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై రాథోడ్ రమేష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజ లింగు, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు మరప రాజు, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపక్ సింగ్ షేకావత్, మాజీ జడ్పీటీసీ పుష్పలత, తదితరులున్నారు.

సమస్యల పరిష్కారంలో కాలయాపన వద్దు

● అర్జీలను స్వీకరించిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త ● గిరిజన దర్బార్‌కు తరలివచ్చిన ఆదివాసీలు ● పాల్గొన్న అధికారులు



అర్జీదారుల సమస్యలు వింటున్న పీవో ఖుష్బుగుప్త



పీవోకు స్వీట్లు తినిపిస్తున్న దినసరి ఉద్యోగులు

ఉట్నూర్, జూలై 8: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని, కాలయాపన చేయోవద్దని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. తలమడుగు మండలం రేకులగూడెం గ్రామానికి చెందిన ఆత్రంఅయ్యుబాయి తనకు రైతు బంధు మంజూరు చేయించాలని, జన్నారం మండలం కవ్వాల్ గ్రామంకు చెందిన శ్రీనివాస్ తనకి గోపాలమిత్ర సెంటర్ కావాలని, కాసిపేట్ మండలం దేవపూర్‌కి చెందిన లక్ష్మణ్ తనకు ఏదైనా ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం ఇప్పించమని, నేరడిగొండ మండలం రంగం వాడి గ్రామానికి చెందిన రూపాబాయి ఆర్థిక సహాయం కావాలని కోరారు. పింఛన్లు, రెండు పడక గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని గిరిజన ప్రజలు దరఖాస్తులుసమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ కనక భీంరావ్, డీఎంజీసీ రామనందం, ఏజెన్సీ అదనపు వైద్యాధికారి మనోహర్, పీహెచ్‌వో సందీప్ కుమార్, ఏవో సున్నం రాంబాబు, ప్రిన్సిపాల్ మేస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, నాగభూషణం, అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● **పీవోకు కృతజ్ఞతలు తెలిపిన దినసరి ఉద్యోగులు**

ఉట్నూర్: ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలోని ఉమ్మడి జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పని చేస్తున్న దినసరి నాల్గవ తరగతి ఉద్యోగులకు వేతనాలు పెంచడంతో దినసరి ఉద్యోగులు పీవో ఖుష్బుగుప్తకు కృతజ్ఞతలు తెలపారు. గిరిజన సంక్షేమ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో దినసరి ఉద్యోగులు పీఓను సన్మానించి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలోని 4వ తరగతి సంఘం బాధ్యులు షౌకత్ హుస్సేన్, రామ్‌చందర్, కేబీసీ నారాయణ, ఆడ గోద్రూ, కె.జంగు, ఎం.కమల, తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారుడి సమస్యను వింటున్న కలెక్టర్ రాజార్షిషా



బెల్లూరిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ..

అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

● 'ప్రజా ఫిర్యాదుల విభాగం'లో జిల్లా కలెక్టర్ రాజార్షిషా

ఆదిలాబాద్ అర్బన్, జూలై 8: ప్రజలు ఇచ్చే అర్జీలపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వాటిని త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాజార్షిసా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఆయన పాల్గొని వినతులను స్వీకరించారు. ప్రజలు వారి సమస్యలను తెలియజేస్తూ ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చే అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. వారి పరిధిలోని వాటినిఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలాగే, జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఔత్సాహికులు ఆవిష్కరణలో తమ ప్రతిభను చాటుకునేందుకు ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని కలెక్టర్‌రాజార్షిషా అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటింటా ఇన్నోవేషన్‌పై సమీక్షించారు. జిల్లా కోఆర్డినేటర్ సాయి కృష్ణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు, విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలను పవర్ పాయింట్ ప్రాజెక్టు ద్వారా తెలిపారు. అనంతరం ఇన్నోవేషన్ అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామల దేవి, ఎస్సీ అభివృద్ధి అధికారి సునిత, డీఈవో ప్రణీత, డీఐఈవో రవీందర్, తదితరులున్నారు.

● **ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్**

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని వార్డ్ నంబర్.3 పరిధిలోని బెల్లూరిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనం గదితో పాటు తదితర వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, మున్సిపల్ కమిషనర్ ఖమర్ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారి సాధన

వర్షాకాలం దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

● పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా ఉప వైద్యాధికారి

భీంపూర్, జూలై 8: వర్షాకాలం దృష్ట్యా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సాధన అన్నారు. ఆమె సోమవారం భీంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. ఆయనతో భీంపూర్ వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రాజ్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి లింగంపల్లి జ్ఞానేశ్వర్, సిబ్బంది గంగాధర్, మేఘా, పూర్ణిమ, సంతోష్, విలాస్, అశోక్‌రెడ్డి, తదితరులున్నారు.

అంగన్‌వాడీల రిలే నిరాహార దీక్షలు

ఆదిలాబాద్ రూరల్, జూలై 8: ప్రభుత్వ ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు రూ.రెండు లక్షలు, ఆయాకు రూ.లక్ష రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు సునీత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ అన్నారు. జీవో నెంబర్.10ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీలకు పెన్షన్ తక్కువ ఇచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

'వీక్లీ ఆఫ్‌లు అమలు చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, జూలై 8: కేజీబీవీ, యూఆర్‌ఎస్‌లలో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్లకు వీక్లీ ఆఫ్‌లు అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ, యుఆర్‌ఎస్, నాన్‌టీచింగ్ వర్కర్స్ యూనియర్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి దుర్గం కళావతి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 17 కేజీబీవీ, ఒక యూఆర్‌ఎస్ పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిలో పని చేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లకు వీక్లి ఆఫ్ ఇవ్వాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నా.. విద్యాశాఖ అధికారులు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. వారాంతపు సెలవులు అమలుచేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో జిల్లా అధ్యక్షురాలు సునిత, జిల్లా నాయకులు గీత, శ్రీవేజ, మనోజ, మల్లయ్య తదితరు లున్నారు.

జిల్లా జైలులో వైద్య శిబిరం

ఆదిలాబాద్ రూరల్, జూలై 8: జిల్లా కారాగారంలో ఖైదీలకు జైలు సూపరింటెండెంట్ పి.అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. డీఎల్‌ఎస్‌ఏ ఆదేశాల మేరకు రిమ్స్ వైద్యుల బృందం డాక్టర్ నవీన్(జనరల్ మెడిసిన్), ఎం.వివేక్(ఆర్థోపెడిక్), భాను జెన్నిఫర్ (ఇఎన్‌టీ), ఫయాజ్ అష్రఫ్ (జనరల్ మెడిసిన్), సచిన్ రెడ్డి (డెంటిస్ట్రీ స్పెషలిస్ట్), డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జై సింగ్ సమక్షంలో వారికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో జైలు అధికారులు సూర్యప్రకాష్ రెడ్డి, మధు, ప్రకాష్, వైద్య సిబ్బంది దామోదర్, హారిక పాల్గొన్నారు.



ఖైదీలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది